మమ్మల్ని ఎవడ్రా ఆపేది?

చిల్లకూరు: తొణుకుమాల ప్రాంతంలో మట్టి తవ్వి టిప్పర్లకు నింపుతున్న యంత్రాలు



చిల్లకూరు: చింతవరంలో గ్రావెల్ తవ్వకాలతో పడిన గుంతలు



చిట్టమూరు మండలం యాకసిరిలో మట్టి తవ్వుతున్న యంత్రాలు



కూటమి అధికారం చేపట్టాక మట్టి మాఫియా పంజా విసురుతోంది. విచ్చలవిడిగా మట్టి తవ్వకాలతో ప్రభుత్వ భూములు, చెరువుల్లో అగాథాలు ఏర్పడుతున్నాయి. అసలు భూములేవో చెరువులేవో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రి పగలు తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టి అక్రమంగా తరలిపోతోంది. అక్రమార్కులకు అధికారులు తలొగ్గడంతో ఇసుక దందా నిరాటంకంగా సాగిపోతోంది. కలెక్టర్ ఆదేశాలిచ్చినా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. అంటే ఏ స్థాయిలో ఈ మట్టి దందా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ భూములు, చెరువుల్లో సాగుతున్న ఈ మట్టి దందాపై ప్రత్యేక కథనం.



వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంలో ఇసుక తవ్వకాలు చేస్తున్న యంత్రాలు

సాక్షి నెట్‌వర్క్: ఖనిజ సంపద అయిన ఇసుక, సిలికా, మట్టి పుష్కలంగా దొరికే భూములు గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్నాయి. వీటిపై కన్నేసిన కూటమి నాయకులు అధికారం చేట్టిన వెంటనే ఎవరికి వారుగా కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని మట్టి, గ్రావెల్, ఇసుక, సిలికాను అక్రమంగా తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చోటా నాయకులు కూడా బడాబాబులుగా మారిపోయారు. ఎవరైనా ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా అక్రమ కేసులు బనాయించి ముప్పతిప్పలు పెడుతున్నారు. ఫలితంగా అక్రమంగా ఖనిజ సంపదను తవ్వి తరలించుకునే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. అయితే సామాన్యుడు తన ఇంటి అవసరాలు తీర్చుకునేందుకు ట్రాక్టర్లతో మట్టి, ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తే వెంటనే రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని వాడిపై కేసులు బనాయించే స్థితికి చేరుకున్నారు. ఇలా నియోజకవర్గంలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ప్రతి రోజూ వందలాది టిప్పర్ల మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. ఇసుక, సిలికా కూడా ఇదే పంథాలో ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

గూడూరు మండలంలోని దివిపాళెం, నెలటూరు, చెన్నూరు. తుంగపాళెం, చెమిర్తి, గొల్లపల్లి, తదితర ప్రాంతాల నుంచి నిత్యం ట్రాక్టర్, టిప్పర్లతో గ్రావెల్, మట్టిని కూటమి నాయకులు తవ్వి పలు ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

చిల్లకూరు మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో లభించే సిలికాను రాత్రుల్లో అక్రమంగా తరలించేస్తున్నారు. గ్రావెల్ తవ్వకాలు తొణుకుమాల, చింతవరం, కలవకొండ గ్రామాల్లోని ప్రభుత్వ భూములు చెరువులైపోతున్నాయి.

కోట మండలంలోని రాఘవాపురం, కేశవరం, మద్దాలి, గూడలి, చంద్రశేఖరపురం, ఊనుగుంటపాళెం తదితర ప్రాంతాల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వి తరలిస్తుండడంతో బావులను తలపించేలా గుంతలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు గూడలి ప్రాంతంలోని స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

పొర్లు కట్టలు ధ్వంసం

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని విన్నమాల గ్రామ సమీపంలో కమ్మవారిపాళెం చెరువులో ఇటాచీ, జేసీబీలతో భారీగా తవ్వకాలు చేపట్టి మట్టిని టిప్పర్లతో తరలించేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జిల్లా కలెక్టర్ ఈ చెరువును పరిశీలించాలని ఆదేశించారు. కొన్ని రోజుల కిందట ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు కమ్మవారిపాళెం చెరువు ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. చెరువు రూపురేఖలు తొలిచేస్తూ భారీ గుంతలు తవ్వి ప్రమాద కరంగా మార్చేసినట్లు గుర్తించారు. అంతేకానీ ఆ తరువాత దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అధికారులకు మామూళ్లు అందడం వల్లే పట్టించుకోలేదని గ్రామస్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అరవపెరిమిడి, పుదూరు, పూడేరు, గొట్టిప్రోలు గ్రామాల్లో చెరువులు, అటవీ ప్రాంతాల్లో సైతం ఈ మట్టి దందా కొనసాగుతోంది.

ఎర్రమట్టి దొంగలు

తడ: మండలంలోని మాంబట్టు ప్రభుత్వ పారిశ్రామిక వాడలోని భూముల్లో ఎర్ర మట్టి విరివిగా లభిస్తుడడంతో అక్రమ వ్యాపారులు పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో నిరాటంకంగా తరలించేస్తున్నారు. మాంబట్టు, కొండూరు, కాదలూరు పంచాయతీల పరిధిలో మాంబట్టు ప్రభుత్వ సెజ్ విస్తరించి ఉంది. సెజ్ పరిధిలోని పరిశ్రమలకు సమీపంలో, జాతీయ రహదారికి పక్కనే జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్ల సాయంతో ఏపీఐఐసీ భూములతోపాటు ఇరిగేషన్ పరిధిలోని చెరువుల్లోనూ అక్రమార్కులు భారీగా గుంతలు తీసి గ్రావెల్ తరలిస్తున్నా అడిగే నాథుడు లేడు. కాదు కూడదని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యాలు, కులాల కేసులతో బెదిరింపులకు దిగుతున్నారు.

వాకాడు మండలంలో కొంతమంది కూటమి నాయకులు చెరువుల్లో మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. మండలంలోని బాలిరెడ్డిపాళెం, వాకాడు ప్రాంతాల్లో స్వర్ణముఖి నదిలోని ఇసుకను తవ్వి చెన్నై ప్రాంతాలకు తరలించేస్తున్నారు.

చిట్టమూరు మండలంలో స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతాలైన గునపాడు, గునపాటిపాళెం గ్రామాల సమీపం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. యాకసిరిలో రిజర్వు పారెస్టు భూముల నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తవ్వేస్తున్నారు.

జోరుగా ఇసుక రవాణా

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని ఇలుపూరు, గోకుల కృష్ణ ఇంజినీరింగ్ కళాశాల వద్ద కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. కూటమి నేతలోని బడా, చోటా నాయకులందరూ ఇసుక తరలింపును వ్యాపారంగా మార్చుకున్నారు. రహస్య ప్రాంతాల్లో డంపింగ్ చేసుకుని అక్కడ నుంచి అక్రమంగా చెన్నై సరిహద్దు దాటిస్తున్నారు. ఇలుపూరులోని ఇళ్ల ముందే డంపింగ్ చేసుకుటుంన్నారు. వందల ట్రాక్లర్లు సరిహద్దు దాటుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

చెరువులు అగాథాలు

దొరవారిసత్రం : మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువుల్లో భారీ తవ్వకాలు చేపట్టి మట్టి తరలించేస్తున్నారు. దీంతో ఎకరాల కొద్దీ భూములు అగాథాలుగా మారాయి. ప్రధానంగా పూలతోటమిట్ట, నెలబల్లి, మినమనముడి గ్రామాల పరిధిలో అక్రమ తవ్వకాలు, తరలింపులకు అడ్డే లేకుండా పోతోంది. కల్లూరు, మేలుపాక, తల్లంపాడు, తనియాలి, వేణుంబాకం, నెలబల్లి, బురదమడుగు, అక్కరపాక తదితర గ్రామాల్లోని చెరువుల్లో మట్టిని భారీగా తరలించేయడంతో ఎక్కడ పడితే అక్కడ భారీగా గుంతలు ఏర్పడ్డాయి. సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లోని పరిశ్రమలకు, లేఅవుట్లకు మట్టి అక్రమంగా తరలించి భారీ మొత్తంలో దోచుకుంటున్నారు.



గూడూరురూరల్‌లోని నెలటూరులో యంత్రాలతో మట్టి తవ్వకాలు



సూళ్లూరుపేట: గోకుల కృష్ణ ఇంజినీరింగ్ కళాశాల సమీపం నుంచి తరలిపోతున్న ఇసుక



నాయుడుపేట: కమ్మవారిపాళెం చెరువులో ఇటాచీతో తవ్వకాలు



కోట మండలం ఊనుగుంటపాళెంలో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు



తడ: కొండూరు వద్ద భూముల్లో మట్టిని ట్రాక్టర్లకు నింపుతున్న యంత్రాలు



తనియాలి చెరువులో పట్టపగలే మట్టి తరలింపు (ఫైల్)



నాయుడుపేట : చెరువులో ప్రమాదకరంగా ఉన్న భారీ గుంతలు



నాయుడుపేట : పొర్లుకట్టను తెగ్గొట్టి ఏర్పాటు చేసిన రహదారి



పూలతోటమిట్ట ప్రాంతంలో చెరువులా మారిన ప్రభుత్వ భూమి

క్లుప్తంగా

ఘనంగా నివాళి



నివాళులర్పిస్తున్న నేదురుమల్లి

సైదాపురం: ముప్పాళ్ల పార్వతమ్మ మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చాగణం రాజుపాళెం గ్రామానికి చెందిన ముప్పాళ్ల పార్వతమ్మ ఇటీవల మృతి చెందారు. మృతురాలి స్వగృహంలో ఆదివారం జరిగిన ఉత్తర క్రియలకు నేదురుమల్లి హాజరయ్యారు. పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతురాలి కుటుంబ సభ్యులైన ముప్పాళ్ల వెంకటేశ్వర్లరాజు, పెంచలరాజులకు మనోధైర్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

అమ్మవారి సేవకులం



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

చిల్లకూరు: ముత్యాలమ్మ అమ్మవారి సేవకులుగా పని చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ముత్యాలమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ఎంపికైన చిల్లకూరు దశరథరామిరెడ్డి అన్నారు. తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు ఆదివారం లాంఛనంగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా సభ్యులుగా ఎంపికైన అన్నం మునిశేఖర్, తూపిలి పద్మమ్మ, అనిమెల్ సుబ్రహ్మణ్యం, వినుకొండ సుబ్రహ్మణ్యం, మేకల కమల, ఒబ్బాయి ఉమా మహేశ్వరి, పొక్కాళి శ్రీలక్ష్మి, సారంగం రమేష్, దువ్వూరు అనిత, ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొన్నారు.

14న బుద్ధుడి విగ్రహావిష్కరణ

దక్కిలి: మండలంలోని అంబేడ్కర్ నగర్‌లో ఈ నెల14వ తేదిన ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ ధర్మ పోరాట సమితి (ఏడీపీఎస్) ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు ఏడీపీఎస్ నాయకులు గుండోలు గోపాల్, జంగిటి వెంకటయ్య ఆదివారం తెలిపారు.

16న చదరంగం పోటీలు

చిల్లకూరు: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 16న చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తాజుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు డివిజన్‌లోని 10 తరగతి లోపు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. గూడూరు డీఆర్ డబ్ల్యూ కళాశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు తమ పేర్లను ఈ నెల 15 సాయంత్రం లోగా నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99087 04750, నరేంద్రనాథ్ చౌదరి, 94939 09951 గిరిబాబును సంప్రదించాలన్నారు.

కాశీపురంలో విగ్రహ ప్రతిష్ట

వాకాడు: మండలంలోని కాశీపురంలో నూతనంగా నిర్మించిన గణపతి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహించారు. ఆయన నిర్వాహకులు గత మూడు రోజులుగా ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు హోమాలు, కుంభాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉత్తర భాగంలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం నిర్మించి విగ్రహ ప్రతిష్ట చేశారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పెళ్లకూరు: మండలంలోని అక్కగారిపేట గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి(50) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు వెళుతున్న కారు ఢీకొంది. గాయపడిన వ్యక్తిని శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్సలు పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలోని శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వేడుకగా పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలకు అంకురార్పణ గావించారు. ఆలయ అర్చకుడు మూలంరాజు భానుప్రకాష్ శర్మ వేద మంత్రోచ్ఛరణతో పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, రక్షా బంధనం, మంత్ర పుష్పం పూజలు నిర్వహించారు.

చికెన్ ధరలు		13-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	118
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	214
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	236
లేయర్ చికెన్	:	207

నేడు నకిలీ మద్యంపై నిరసన

నాయుడుపేట టౌన్: నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు హరిస్తూ కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. నాయుడుపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సంజీవయ్య విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమ మాదిరిగా అక్రమంగా తయారు చేస్తూ సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నకిలీ మద్యం కారణంగా ప్రజల ప్రాణాలు పోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. నకిలీ మద్యంతోపాటు అక్రమ బెల్టు దుకాణాలతో గ్రామాల్లో గొడవలు సృష్టిస్తున్నారన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని నాయకులతో కలిసి సోమవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాయుడుపేటలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసనలు చేపడుతున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య



కాటూరు రామతులసి

వెంకటగిరిలో...

వెంకటగిరి (సైదాపురం): ప్రాణం తీస్తున్న కల్తిమద్యంపై నేడు నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కాటూరు రామతులసి పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసం నుంచి స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, మహిళా విభాగం నాయకులురాళ్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తే దండన



డిజిటల్ బుక్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న చింతల శ్రీనివాసులురెడ్డి, నాయకులు, కార్యకర్తలు

దక్కిలి: కూటమి నాయకుల ప్రోత్సాహంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తే రానున్న రోజుల్లో దండన తప్పదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మోపూరువెల్లంపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు ముప్పాళ్ల మురళి నాయుడు తోటలో ఆదివారం వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కూటమి నాయకుల దౌర్జన్యాలు, అధికారుల అక్రమ కేసులు పెరిగిపోవడం వల్ల కార్యకర్తలను కాపాడుకునేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో అక్రమ కేసులు, అన్యాయాలకు, కూటమి నాయకులు దౌర్జన్యాలకు గురైన నాయకులు డిజిటల్ బుక్, క్యూ ఆర్ కోడ్ ద్వారా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పీ వెంకటరమణ, మాజీ ఎంపీపీ చెంచయ్య, ఎంఎల్ నారాయణరెడ్డి, వేణు నాయుడు, ఎం మురళీకృష్ణ, భాస్కర్‌నాయుడు, బలరామిరెడ్డి, వెంకటాద్రి, మురళీరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బండి రమేష్‌రెడ్డి, పిల్లి రామసుబ్బారెడ్డి, లతీష్‌రెడ్డి, గుండోలు మధు, రాపూరు చిరంజీవి, మామిడి ప్రభాకర్, కే బాలకృష్ణ, ఆంజనేయులు, చెంచయ్య, మెట్టుకూరు మునీంద్రారెడ్డి, డీపీ యాదవ్, ఆవుల రవి పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్‌డే వేడుకలు

వాకాడు: మండల కేంద్రంలోని సెయింటు జేమ్స్ లూథరన్ చర్చిలో ఆదివారం పాస్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సంఘ కాపరి ఎస్ ప్రశాంత్‌బాబును క్రైస్తవులు సత్కరించారు. అనంతరం క్రైస్తవ భక్తి గీతాలను ఆలపించారు.

మేత భూముల స్వాధీనం

పెళ్లకూరు: మండలంలోని రోసనూరు గ్రామంలో ఆక్రమణలో ఉన్న మేత భూములను ఆదివారం ఆర్ఐ సంతోషిణి బాయి సర్వే చేసి స్వాధీనం చేసుకున్నారు. కొందరు స్థానికేతరులు సుమారు 70ఎకరాలకు పైగా మేత భూములను ఆక్రమించారు. ఈ విషయమై గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ మేత భూముల స్వాధీనానికి చర్యలు తీసుకున్నారు.



భూములు స్వాధీనం చేసుకున్న అధికారులు

వైఎస్సార్ సీపీ నేత మృతికి నివాళి





మనోహర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్, కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు పంచాయతీ తంబుగారిపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత చింతలమూడి మనోహర్ (56) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మండల పార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ నాయకులు మృతుడి స్వగ్రామానికి చేరుకున్నారు. మనోహర్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్సీలు, మాజీ మంత్రి





నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఇద్దరు ఎమ్మెల్సీలు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే

చిల్లకూరు: గూడూరులోని వీర భద్ర స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, సీనియర్లు హాజరయ్యారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా సాక్షి టీవీ కెమెరా మెన్ వీరభద్ర వివాహ వేడుకకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

'అపూర్వ' సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

రాపూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1989–90 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. తమకు చదువులు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంచి పెట్టారు. రోజంతా సరదాగా గడిపారు, బాల్య స్మృతులను నెమరేసుకున్నారు. అనుభవాలను పంచుకున్నారు.